## స్త్రీపర్వ కథాంశాలు

స్త్రీపర్వమున జలప్రదానికపర్వము. స్త్రీవిలాపపర్వము, శ్రాద్ధపర్వమని మూడు ఉపపర్వములుగలవు. ఇందు మొత్తము 822 శ్లోకములున్నవి.

### 1) జలప్రదానిక పర్వము:-

ఈ ఉపపర్వమున పదిహేను అధ్యాయములుగలవు. తన నూర్గురు పుత్రులు మరణించుటచే ధృతరాష్ట్రుడు మిక్కిలి శోక సంతప్తుడాయెను. అతని అవస్థను చూచి సంజయుడు రాజా! మీరు ఎందుకు శోకించుచున్నారు? ఈ యుద్ధమున పద్దెనిమిది అక్షౌహిణి సేనలు మరణించినవి. మీరు పుత్ర, బంధు, స్నేహితులకు ప్రేతకార్యములు జరిపించుడని చెప్పగా ధృతరాష్ట్రుడు సంజయా! యుద్ధమున పుత్ర,మిత్ర, బాంధవులందరు మరణించిరి. ఇచ్చట నేను దుఃఖముల ననుభవించెదను. పరశురామ, నారద, వ్యాసాదుల హితవచనములను పెడచెవిని బెట్టితిని. శ్రీ కృష్ణ భీష్ముల హితబోధను పుత్రప్రేమతో పట్టించుకోలేదు. దీని ఫలితమును ఇప్పుడను భవించుచున్నానని శోకించెను. అతనిని ఓదార్చుచు సంజయుడు రాజా! యౌవనదర్పముతో మీ పుత్రుడు దుర్యోధనుడు యథేష్టముగా దుర్వ్యవహారము చేసినాడు. దుష్ట దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని, చిత్రసేనుడు, శల్యుడు అతని మంత్రులు. అతడు ఎవరి ధార్మికవచనములను వినలేదు. మీరు కూడా తటస్థముగానే ఉంటిరి. ఉచితమగు సలహా ఈయలేదు. ఇప్పుడు దుఃఖించిన ఏమి లాభము. కనుక దుఃఖించవలదని ధృతరాష్ట్రుని సముదాయించెను. ధృతరాష్ట్రుని ఓదారుస్తూ విదురుడు రాజా! మీరు ఎందుకు దుఃఖించుచున్నారు? చివరకు సమస్త ప్రాణికోటికి ఇట్టి స్థితియే లభించును. కాలము నెవ్వరు ఉల్లంఘించలేరు. యుద్ధమున వీరగతిని పొందిన వారిగురించి శోకించుట తగదని పలికెను. ధృతరాష్ట్రుని ప్రశ్నకు సమాధానముగా విదురుడు సమస్తప్రపంచము అనిత్యమని వర్ణించెను. అతడు మహారాజా! సంసారసాగరమున మునిగిన మానవుడు భయపీడితుడైనప్పటికి జీవితముపై ఆశను, కోరికను విడిచిపెట్టడు. బుద్ధిమంతుడగు పురుషుడు సంసారచక్రము యొక్క యథార్థస్థితిని తెలుసుకొని వైరాగ్యంతో సంసారబంధములనుండి విముక్తుడగును. రాజా!

ప్రాణుల శరీరము రథము. సత్త్వగుణము సారథి. ఇంద్రియములు గుఱ్ఱములు. కర్మబుద్ధి రజ్జువులు. ఏమానవుడు గుఱ్ఱములవేగము ననుసరించునో అతడు ఈసంసారచక్రమున భ్రమించుచుండును. నిగ్రహంతో ఇంద్రియములను
వశపరచుకొనినవాడు సంసారబంధముల యందు పడడు అని చెప్పెను.

పుత్రశోకంతో సంతప్తుడైన ధృతరాష్ట్రుని ఓదారుస్తూ వ్యాసమహర్షి రాజా! ఈజగత్తు అంతా అనిత్యము. పరమపదము నిత్యము. జీవితాంతమున మరణమే కల్గును. దానిని తలుచుకొని శోకించుట తగదు. కౌరవుల వినాశము తప్పనిసరి. దైవ విధానమును చెప్పెదను వినుము. పూర్వకాలమున ఒకసారి ఇంద్రసభయందు భూదేవి దేవతలు ప్రతిజ్ఞ చేసిన కార్యమును తొందరగా ముగించమనికోరెను. ఆమె మాటలు విన్న విష్ణుమూర్తి ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో పెద్దవాడైన దుర్యోధనుడు నీ కార్యమును నెరవేర్చగలడు. రాజులందరు కురుక్షేత్రయుద్ధమున ఒకరినొకరు చంపుకొందురు. అప్పుడు భూభారము తీరగలదని చెప్పెను. ధృతరాష్ట్రా! క్షత్రియలోకసంహారముకొఱకు కలి అంశయే దుర్యోధనుని రూపమున గాంధారి గర్భమున జన్మించెను. దైవవశముచే సోదరులు కూడా అటువంటి వారే పుట్టిరి. మామ శకుని, కర్ణులు కూడా అతనితో కలిసిరి. నీ పుత్రులు స్వయం కృతాపరాధంచే నాశమును పొందిరి. వారిని గూర్చి దుఃఖించుట తగదు. పాండవులు ఎట్టి అపరాధమును చేయలేదని పలికెను. వ్యాసమహర్షి మాటలను విని ధృతరాష్ట్రుడు మహర్షీ! ఇదంతా దైవ ప్రేరణచే జరిగినదని తెలుసుకొంటిని. శోకించకుండుటకు ప్రయత్నించెదనని చెప్పెను. పిమ్మట వ్యాసమహర్షి అంతర్ధానమాయెను.

సైన్యముతోసహా దుర్యోధనుడు చంపబడిన పిమ్మట సంజయుని దివ్యదృష్టి నశించినది. ధృతరాష్ట్రుని సభను చేరి సంజయుడు మహారాజా! అందరూ నీపుత్రుని శాంతిస్థాపనకై ప్రాధేయపడిరి. కాని పాండవుల మీది వైరభావంతో సమస్తభూమండలమును నాశముచేసినాడు. పుత్ర మిత్రబంధువులందరు యుద్ధమున మరణించినారు. వారికి అంతిమ సంస్కారము చేయించమని చెప్పెను. పిడుగు లాంటి వార్తవిని ధృతరాష్ట్రుడు నిశ్చేష్టుడై నేలపైపడెను. ధర్మజ్ఞుడగు విదురుడు ధృతరాష్ట్రుని అవస్థను చూచి అతని వద్దకు వచ్చి రాజా! శోకించవలదు. సమస్త ప్రాణికోటికి ఇదియే అంతిమగతి. కాలమును ఎవ్వరూ

ఉల్లంఘించలేరు. యుద్ధమున మరణించిన వారందరూ స్వర్గమునకే వెడలిరి. వారిగురించి శోకించవలసిన అవసరమేమున్నది.?మనస్సును గట్టి చేసుకొని కర్తవ్యమును గూర్చి ఆలోచించవలసినదని హితవు పలికెను. విదురుని మాటలు విని ధృతరాష్ట్రుడు కుంతితో సహా గాంధారి, ఇతర స్త్రీలను తీసుకురమ్మని అతని నాదేశించి రథముపై బయలుదేరెను. పుత్రశోకంలో మునిగిన గాంధారి, కుంతి మున్నగువారితో ధృతరాష్ట్రుని వద్దకు వచ్చెను. దుఃఖిస్తున్న వారందరిని విదురుడు
ఓదార్చెను. ధృతరాష్ట్రునితో బాటు కృపాచార్య, అశ్వత్థామ, కృతవర్మలు కూడా వచ్చిరి. ఆముగ్గురు వీరులు ధృతరాష్ట్రుని చూచి అశ్రుగద్గద కంఠంతో మహారాజా! మీ పుత్రులు అత్యంతము అనుచిత కర్మనాచరించి అనుచరులతోకూడా ఇంద్రలోకమునకు వెడలిరి. కౌరవసైన్యమంతయు నశించినది. మేము ముగ్గురము మాత్రము బ్రతికి బయటపడితిమని చెప్పిరి. కృపాచార్యుడు దుఃఖిస్తున్న గాంధారితో దేవి! మీ పుత్రులు వీరోచితముగ పోరాడి వీరగతిని పొందిరి. వారిని గూర్చి శోకించుట తగదు. యుద్ధము తరువాత పాండవులకు ఎట్టి విశేష లాభము కలుగలేదు. భీమసేనుడు మీ పుత్రుని అధర్మముగ చంపినాడు. కనుకనే అశ్వత్థామను ముందుంచుకొని మేము రాత్రికి రాత్రి పాండవుల శిబిరమున చేరి ధృష్టద్యుమ్నుని, ద్రౌపదీపుత్రుల నందరిని చంపితిమి. మీపుత్రునికి శత్రువులయిన వారిని వధించి శత్రువులకంటబడకుండగా పారి పోవుచున్నాము. ఇక్కడ మేము నిలువజాలము. ప్రతీకారము తీర్చుకొనుటకు ఏదో ఒక సమయమున పాండవులు ఇచ్చటకు రాగలరని చెప్పి ధృతరాష్ట్రుని నుండి అనుమతి పొంది ముగ్గురు మూడు వైపులకు వెడలిరి. కృపాచార్యుడు హస్తినాపురమునకు, కృతవర్మ తన దేశమునకు, అశ్వత్థామ వ్యాసాశ్రమమునకు వెడలిరి. సూర్యోదయమునకు పూర్వమే వారు ముగ్గురు అభీష్టస్థలములకు చేరిరి. పిమ్మట పాండవులు అశ్వత్థామ వద్దకు వెళ్ళి యుద్ధమున అతనిని ఓడించిరి.

పుత్రశోకంతో సంతప్తుడైన యుధిష్ఠిరుడు తన సోదరులతో కూడా ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళెను. శ్రీ కృష్ణుడు, సాత్యకి, యుయుత్సువులు వారితో వెళ్ళిరి. ద్రౌపది కూడా పాంచాల స్త్రీలతో వారిని అనుసరించినది. అందరూ గంగా తటమును చేరిరి. ఆర్తనాదము చేయుచున్న వేలకొలది స్త్రీలు ధర్మరాజును చుట్టుముట్టి అతనిని నిందించిరి. వారిని దాటుకొని

యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రుని చేరి అతనికి నమస్కరించెను. మిగిలిన పాండవులు కూడా ధృతరాష్ట్రునికి నమస్కారము చేసిరి. పుత్రశోకముతో బాధపడు చున్న ధృతరాష్ట్రుడు అనిష్టంగానే ధర్మరాజును కౌగలించుకొని భీముని కొఱకు వెదకసాగెను. ఆసమయమున అతని మనస్సును చెడుభావము అంకురించినది. అతని హృదయమును తెలుసుకొన్న శ్రీ కృష్ణుడు భీమసేనుని తప్పించి అతని స్థానమున లోహమయమూర్తిని ధృతరాష్ట్రుని యెదుట నిలబెట్టెను. ఆమూర్తిని నిజమగు భీమసేనునిగా తలచి రెండుచేతులతో గట్టిగా అదిమి ముక్కముక్కలు చేసెను. నోటి రక్తము కారుటవలన తడిసిన ధృతరాష్ట్రుడు నేలపైపడెను. పిమ్మట సంజయుడు అతనిని లేవనెత్తి సముదాయించుచు మీరు ఈవిధముగా చేయుట యుక్తముగాదని హితవు

పలికెను. క్రమముగా ఆవేశము తొలగిపోయి ధృతరాష్ట్రుడు శోకసాగరమున మునిగిపోయెను. అసలు విషయము చెప్పి శ్రీ కృష్ణుడు అతనిని ఓదార్చెను. ప్రసన్నచిత్తుడైన ధృతరాష్ట్రుడు అర్జున నకులసహదేవులను ఆలింగనము చేసుకొనెను. పిమ్మట పాండవులందరు శ్రీ కృష్ణునితో కూడి గాంధారివద్దకు వెళ్ళిరి. దేవి గాంధారి పాండవులకు శాపమీయ దలచెను. ఇది తెలుసుకొని వ్యాసమహర్షి అక్కడకు వచ్చి ఆమె క్రోధమును నియంత్రించుటకు ఉపదేశముచేసెను. గాంధారి శ్రీ కృష్ణునితో హే భగవన్! పాండవుల యెడల నాకు అసూయలేదు. వారి వినాశము కూడా నేను చూడదలచుకోలేదు. పుత్రశోకంతో నామనస్సు వికలముగుచున్నది. నాకొడుకు దుర్యోధనుడు, నాసోదరుడు శకుని, కర్ణ దుశ్శాసనుల అపరాధము వలన కురువంశనాశము జరిగినది. ఇందులో పాండవుల తప్పేమీలేదు. కాని శ్రీ కృష్ణుడు చూస్తుండగానే గదా యుద్ధమున భీమసేనుడు దుర్యోధనుని యెడల ఆచరించిన అనుచితవ్యవహారము నాకు నచ్చలేదు. గదా యుద్ధమున తన కంటె దుర్యోధనుడు చతురుడని తెలుసుకొని నాభిప్రదేశమున కధోభాగమున ప్రహారము చేయుట నాకు కోపమును కల్గించినదని పల్కెను. గాంధారి కోపమును గమనించిన భీమసేనుడు భయపడి సవినయముగ ఆమెతో ఇట్లు పలికెను. ఇది ధర్మమో అధర్మమో కాని నేను దుర్యోధనునికి భయపడి ప్రాణములు దక్కించుకొనుటకు ఇట్లు చేసితిని. నిండు సభలో దుర్యోధనుడు ద్రౌపదిని అవమానించెను. అతడు సభలో ఆమెకు తన

ఎడమతొడ చూపినాడు. కనుకనే నేను తొడ విరగగొట్టితిని. గాంధారి తన కొడుకు చేసిన తప్పును ఒప్పుకొనినది. దుశ్శాసనుని చంపి అతని రక్తమును త్రాగుట భీమసేనుని అనుచితకర్మగా గాంధారి పేర్కొనగా భీమసేనుడు ఇతరుల రక్తపానము అనుచితమే. అమ్మా! మీరు విచారించవలదు. రక్తము పెదవులు దంతములు దాటి వెళ్ళలేదు. కేవలము నారెండు చేతులు మాత్రమే రక్తముతో తడిసినవి. నాప్రతిజ్ఞను పూర్తిచేసుకొనుటకే ఇట్లుచేసితిని. గాంధారి నావందమంది కొడుకులను చంపు సమయమున తక్కువ అపరాధములు చేసిన ఒక్కకొడుకైనను మిగిలి యున్న నాకు ఇంత కష్టము కలిగియుండెడిది కాదని భీమసేనునితో పలికి గాంధారి కోపముతో యుధిష్ఠిరుడు ఎక్కడని అడిగెను. అదివిని భయపడిన ధర్మరాజు అమ్మా! తమ పుత్రుల వధకు కారణము నేనే. నాకు శాపమీయవలసినదని తలవంచి గాంధారి కాళ్ళపై పడబోయెను. ఇంతలో కళ్ళకు గట్టిన పట్టీనుండి గాంధారి ధర్మరాజు యొక్క కాళ్ళవ్రేళ్ళ అగ్రభాగమును చూచెను. దృష్టిపాతముచే అతని అందమైన కాలి వ్రేళ్ళగోళ్ళు
నల్లబడెను. సోదరుని దురవస్థను చూచి అర్జునుడు శ్రీ కృష్ణుని వెనుక దాగెను. మెల్లమెల్లగా గాంధారి కోపము చల్లారెను. ఆమె తల్లివలె అందరిని సముదాయించెను. పిమ్మట పాండవులు కుంతీమాత వద్దకు వెళ్ళిరి. విలపిస్తున్న ద్రౌపదిని కుంతి సముదాయించి ధైర్యము చెప్పెను. తదనంతరము వారిద్దరు పాండవులతో కూడా గాంధారి వద్దకు వెళ్ళిరి. గాంధారి వారిద్దరిని సముదాయించి నా అపరాధము వలననే కౌరవవంశము నాశము జెందెనని చెప్పెను.

**2) స్త్రీవిలాప పర్వము:-**

ఈ ఉప పర్వమున పది అధ్యాయములు గలవు. గాంధారి దివ్యదృష్టితో కౌరవుల వినాశస్థలమును చూచెను. అమంగళమయమగు దృశ్యమును చూచి ఆమె అనేక విధములుగ విలపించెను. పిమ్మట వ్యాసుని ఆజ్ఞననుసరించి ధృతరాష్ట్ర పాండవులు యుద్ధభూమికి వెళ్ళిరి. కురువంశ స్త్రీలు అక్కడికి వెళ్ళి తమ పతి, సోదర, బంధువుల మృత శరీరములను చూచి ఆర్తనాదములను చేసిరి. దుర్యోధనుని పార్థివ శరీరమును, దాని వద్ద విలపిస్తున్న కోడలిని చూచి గాంధారి శ్రీ కృష్ణుని

వద్ద విలపించెను. పుత్రులు, సోదరుని మృత శరీరములను చూచి గాంధారి మిక్కిలి విలపించెను.

**3) శ్రాద్ధ పర్వము:-**

ఈ ఉప పర్వమున రెండు అధ్యాయములు గలవు. శ్రీ కృష్ణ భగవానుడు గాంధారితో ఇట్లు పలికెను. నీవు శోకించవలదు. దుర్యోధనుని దుర్వ్యవహారమును సరైనదిగా తలచి అపరాధము చేసితివి. నీవు చేసిన అపరాధమును నామీద ఏల నెట్టుచున్నావు? శ్రీ కృష్ణుని అప్రియవచనములను విని గాంధారి మిన్నకుండెను. ధృతరాష్ట్రుని ఆదేశమును పొంది యుధిష్ఠిరుడు మృతులందరికి అంతిమ సంస్కారములు గావించెను. కుంతి కర్ణుని జన్మరహస్యమును బయట పెట్టెను. కర్ణుడు తన సోదరుడని తెలుసుకొన్న యుధిష్ఠిరుడు మిక్కిలి దుఃఖించెను. కర్ణుని మరణమునకు తనే కారణమని విలపిస్తూ ఈ రోజు నుండి స్త్రీల వద్ద ఏ రహస్యము దాగదని శాపము ఇచ్చెను. పిమ్మట సోదరులతో కూడా ధర్మరాజు గంగాజలముతో ఒడ్డుకు వచ్చెను.

**ఇది స్త్రీపర్వ కథాంశము.**